# బోడ్గోసూత్రం

భార్గవ

అధికార బాధ్యతలను నిర్వర్తించటానికి ప్రభుత్వం అనేక స్థలాలకు పంపుతుంది. మాయూరంలో ఉన్నత పాఠశాల ఉన్నది. అందులో చాలా అవకతవకలు జరుగుతున్నవని, హెడ్మాస్టరుతో కలసి ఇంకొక ఉపాధ్యాయుడు చాలా డబ్బు మింగుతున్నాడని, కొందరకు జీతాలను సక్రమంగా ఇవ్వటంలేదని ఫిర్యాదులు వచ్చినై. వాటిని పరిశీలించి సక్రమచర్యలను తీసుకొమ్మని నన్ను పంపించారు. ఎలా సాగిపోవాలా అనే విషయాలను ఆలోచిస్తూ పార్కులో ఆ సాయంత్రం కూచున్నా. ఇంతలో కాస్త దూరంగా విషాదమే రూపుదాల్చినట్లు కన్పించింది ఒక స్త్రీమూర్తి. నిశితంగా పరిశీలిస్తే పరిచితమైన ముఖంగా కన్పించింది. కాగితం మీద కెక్కని విషయాలేమైనా ఆవిడ చెప్పగలుగుతుందేమోననే ఆశ చిగురించింది. నెమ్మదిగా ఆవిడను సమీపించగలిగాను.




చూడండి మిమ్మల్ని ఎక్కడో చూచినట్లున్నాను.

ప్రతి మగవాడికి ఇదే వరసలెండి.

క్షమించండి. అచ్చంగా మీలాగే సుజాత అనే అమ్మాయి ఉండేది. నా చిన్నతనంలో మా వీధిలోనే ఆమె తలిదండ్రులు ఉండేవారు. ఆ అమ్మాయితో ఆటలాడుకునేవాడిని.

నా పేరుకూడా సుజాతే కాని నాతో ఆటలాడకండి.

కోపగించకండి. నామాట వినండి. రంగనాధం మేష్టారుగారి కుమార్తె సుజాత. ఇద్దరు కొడుకుల తర్వాత ఆమె కలిగింది. ఒక తమ్ముడుకూడా ఉండేవాడు.

చాలా పకడ్బందీగానే ఈ విషయాలను సేకరించారు గాని మీరెవరు ?

సోమశేఖరంగారి అబ్బాయిని. వరలక్ష్మిగారు మా అమ్మ. నాకొక అక్క. ఇప్పటికైనా నమ్మకం కుదిరిందా ? నన్ను బాబ్జీ అని పిలిచేది సుజాత.

ఇప్పుడెక్కడుంటున్నారు ?

విశాఖలో మీ ఆయనపేరు గోపాలమేనా ?

వెనక ఆయన నాభర్త. ఇప్పుడుకాదు.

ఎందుకని ?

నన్ను వదిలివేశారు.

అయ్యో ! ఎందుకలా జరిగింది ?

మీరేమన్నా ఆర్చేవారా, తీర్చేవారా ?

మిమ్మల్ని చూశానని అమ్మకు చెప్తే ఎన్నో విషయాలను అడుగుతుంది. ఆవిడ సంగతి గుర్తుందా ?

ఇంకా స్త్రీ జనోద్ధరణలోనే ఉన్నారా ?

అదే ఆవిడకు ఆరవప్రాణం. గోపాలం వేసిన కేసు వివరాలను తెలుసుకుని, మిమ్మల్ని కలవాలని,

ఎలాగైనా మీకొక మంచి దారి చూపించాలని చాలా సార్లు అన్నది. మీకభ్యంతరం లేకపోతే ఆ కేసు వివరాలు చెప్పండి. అమ్మకు చెప్తా.

బాబ్జీ!

ఎన్నాళ్ళకు వినగలిగాను ఆ పిలుపు.

బాబ్జీ! ఫరవాలేదు. క్లుప్తంగా చెప్తా వినండి. మీ అమ్మగారి దగ్గరకు చేరాలని ప్రయత్నించేశా. కాని చేయలేకపోయాను.

మీది ఆదర్శ వివాహమని, కట్నకానుకలు లేకుండా గోపాలంతో మీ వివాహం జరిగిందని విని అమ్మ చాలా సంతోషించింది.

అదే నా బ్రతుకుని నాశనం చేసింది. అన్నయ్యల చదువులు వివాహాలు ఐన తర్వాత నాన్నగారు రిటైరయ్యారు. నా వివాహం ఒక సమస్యగా మిగిలింది ఉన్న ఆస్తి ఒక్క ఇల్లు, దానిని అమ్మి నా పెళ్ళి చేస్తానన్నారు. నే పడనివ్వలేదు. ఆ సమయంలో గోపాలంతో నాన్నకు పరిచయమైంది. అయనలో ఇద్దరు వ్యక్తులున్నారని తెలుసుకోలేని నాన్న మా వివాహం చేశారు. అప్పుడే నా జీవితంలో అరణ్యపర్వం ఆరంభమైంది.

ఏం జరిగింది?

శోభనంనాడే అత్తగారు విరుచుకు పడ్డది. దరిద్రం మొహమని, కట్నంలేకుండా చేసుకొనేట్లు కుమారుడిని చేశామని ఒకటే తిట్లు. కొంతసేపు సహించా. అనరాని మాటలంటుంటే ఎదురు జవాబిచ్చా. దాంతో అయనకు తిక్కరేగి బెల్టుపుచ్చుకుని చావగొట్టారు. వాళ్ళ అమ్మకు ఎదురు చెప్పరాదట. ఆ రాత్రి శోభనమని అంతా సంబరపడ్డారు. అదిమటుకు జరగలేదు. రాత్రి అంతా సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ నా శరీరంలోని ప్రతిభాగాన్ని మండుతున్న సిగరెట్టుతో కాల్చారు. విపరీతమైన బాధ. ఒంటినిండా పుళ్ళు. ఈ పుళ్ళు నాకిదవరకే ఉన్నవని, దానిని కప్పిపెట్టామని తల్లికి ఫిర్యాదు. అవిడ దీవెనలకు అంతులేదు. రాచుకోవటానికి మందులేదు. రెండవనాటి రాత్రి ఇంకా ఘోరం. కాల్పులతోబాటు నా చీరకుకూడా నిప్పు అంటించారు. బాధ భరించలేక బయటకువచ్చి తెల్లవారగానే మావూరు చేరుకున్నాను.

మంచి పని చేశారు.

కాదండీ. అక్కడ అమ్మ, నాన్న ఇంకా తిట్టిపోశారు. ఏంచేసినా మొగుడిదగ్గరే పడిఉండమని గెంటివేశారు. ఏంచేయగలను. నా చిన్ననాటి నేస్తం విజయ ఇక్కడ ఉద్యోగం చేస్తున్నదని తెలిసి ఆరాత్రికి రాత్రే దానిదగ్గరకు చేరాను. ఉద్యోగప్రయత్నం చేసి ఇక్కడే తనతోబాటు ఉద్యోగం చేయమన్నది. తప్పలేదు. ఈలోగా విడాకులకేసు. నాశీలం మంచిదికాదని వాదం. అయన నడవడే సరిఐనది కాదని ఆయనకొక రకమైన పిచ్చి అని రుజువుచేస్తూ విడాకులు తీసుకున్నాను.

మళ్ళీ వివాహం తలపెట్టలేదా?

ఒకసారి ఐంది చాలదూ?

అందరూ అలాగే ఉంటారా? కాలేజీలో నాతో బాటు చదువుకుంటున్నప్పుడే గోపాలానికి మానసిక రుగ్మత ఉండేదిలేండి ఇపుడెలావుంది మీ జీవితం?

ఏంచెప్పమంటారు? మొగుడు వదిలివేసిన దాన్నని హెడ్మాస్టర్‌తో సహా చాలమంది చులకనగా మాటలాడుతూ ఉంటారు. నాశీలం మంచిదికాదని నేను తేలికగా వారివశం కాగలనని పాచికలు వేశారు. విజయ మూలకంగా వీటి బారినుండి తప్పించుకోగలిగాను. బదిలీకి ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నా ఫలితం శూన్యం. చివరకు జరుగుతున్నది వింటే ఏమనుకుంటారో.

చెప్పండి.

మూడు నెలలనుంచి నాకు జీతం రావటంలేదు. నాకు అండగా ఉండటంచేత విజయకు రెండునెలల జీతం లేదు. రేపు ఒకటో తేదీ, జీతం ఈసారైనా వస్తుందోలేదో! ఎవరో ఆఫీసరు వస్తున్నారని విన్నాం ఆయనకు చెప్పుకుంటే లాభమేమైనా ఉండవచ్చుని ఆశ.

ఈ విషాదమంతా మీ ముఖంలో గమనించే మిమ్మలిని పలకరించా. నా సలహాను పాటిస్తానంటే ఒక మాట చెప్తాను.

చెప్పండి.

మీకు విశాఖలో స్నేహితులున్నారా?

నా తమ్ముడే ఉన్నాడు, శంకరం.

ఐతే ఈ ఉద్యోగానికి రేపే రాజీనామా ఇచ్చి విశాఖ చేరండి. అక్కడ మా అమ్మగారిని కలుసుకుంటే లాభం ఉండవచ్చు.

ఉన్న ఉద్యోగం పోగొట్టుకోమంటారా?

భయం లేదు. మీలాంటి వారిని చాలామందిని మా అమ్మగారు చేరదీశారు. ఆమె నడిపే ఉన్నత పాఠశాలలో ఉద్యోగాలిచ్చి, వాళ్ళకు చక్కని సంబంధాలు చేసి పంపుతున్నారు. ప్రతినెలా వారి యోగక్షేమాలను విచారిస్తూ వస్తారు. ఉత్తరం ఇస్తాను. రేపే బయలుదేరండి.

అవిడ బొడ్లో ఇంకా ఎన్ని మంగళ సూత్రాలున్నాయండీ?

మా నాన్నగారికే తెలియదు. నాకేం తెలుసు?

ఇక్కడ ఏ పనిమీద వచ్చారు? ఎంతకాలముంటారు?

ఆ పని రేపు సాయంత్రం స్టేషనులో మీకు వీడ్కోలిచ్చేటప్పుడు చెప్తాను. రేపు కలుస్తారు గదా!

అలాగేనండీ, ప్రయత్నిస్తా!

నామీద నమ్మకం కుదరనట్లున్నది.

అదేం లేదండీ, వస్తా.

ఈ కేసును దర్యాప్తు చేయమని అధికారులు నాకప్పగించారు. అదృష్టవశాత్తు ఆమెనే కలుసుకోగలిగాను.. మా అమ్మ ఆదేశించారు. ఒక గది పెంచవలసి వచ్చిందని పాతికవేలు ప్రభుత్వం నుంచి ఈ హెడ్మాస్టర్ తెచ్చారని, గదిని కట్టించినట్లు కాగితాలను సృష్టించాడని చాలా ఫిర్యాదులున్నవి. స్టోర్స్ విషయంలో కూడా ఇంకో ఉపాధ్యాయుడు చాల మింగివేశాడన్నారు. వారం రోజుల నుంచి సి. ఐ. డీ. వారీ స్కూలును క్షుణ్ణంగా అన్వేషించి రిపోర్టులు తయారు చేశారు. రేపు జీతాల పంపిణీ వేళకు స్కూలులో అడుగుపెట్టాలి.

అలాగే చేశాను. ఎవరోలే అని హెడ్మాష్టర్ పట్టించుకోలేదు. నా కార్డ్ తీసి ఆయనకిచ్చాను. గుర్తించాడు. నేనే వస్తానని తెలుసుకొని, ఇలా చెప్పా పెట్టకుండా వస్తానని ఆయన ఊహించలేదు. మర్యాద చేయడం మొదలుపెట్టాడు. ఇంతలో హెడ్ గుమాస్తా జీతాల సంచితో రాగానే. ఆయనను పే రిజిష్టరు తెమ్మని, డబ్బు సంచీని ఇక్కడే ఉంచమని ఆదేశించాను. విధి లేక అలాగే చేశాడు. రిజిష్టర్ తిరగేస్తే సుజాతకు మూడు నెలల నుంచి, విజయకు రెండు నెలల నుంచి, శేఖరానికి రెండు నెలల నుంచి జీతాలు అందలేదు. ఈ ముగ్గురికి లెక్కకట్టి హెడ్మాష్టరును నిలదీశాను: సుజాతను పిలుచుకురమ్మన్నాను. వచ్చింది.

మీరా?

ఔను, నేనే! చూడమ్మా. మీకు మూడు నెలల జీతాలు అందలేదు. ప్రతి నెలకు సంతకం చేసి ఇవాల్టి తారీకు వేయి. నీ జీతం బకాయితో సహా బట్వాడా చేస్తాను.

అలాగే చేస్తుంటే గుమాస్తాకు చెమటలు పుట్టింది. క్రిందటి నెలలకు కూడా ఇవాల్టి తేదీ వేస్తే ఆడిట్ వాళ్ళ ద్వారా ఏం చిక్కులు వస్తాయో అని మొత్తుకున్నాడు.

ఆ చిక్కులను నువ్వు, నీ హెడ్మాస్టర్ ఎదుర్కోండి. ఆ అమ్మాయికి ఈరోజే జీతం ముట్టింది గనుక ఇవాళ్టి తేదీ ఉండి తీరాలి.

ఆ అమ్మాయి జీతం తీసుకురాలేదండీ.

ఎందుకని?

శాంక్షన్ కాలేదని అన్నారు.

ముందు మీరు బకాయిలు పెట్టిన వారికి పంపిణీ చేస్తాము. తర్వాత ఇతరుల విషయం.

జీతం ఈ నెల రాకపోతే చాలా ఇబ్బంది పడతాం సార్.

అలాంటి ఇబ్బందే సుజాతకు, విజయకు, శేఖరానికి ఉంటుందని మరచిపోయారా?

హెడ్మాస్టర్ గారు చేయమన్నట్లు చేశామే గాని మా తప్పేమీ లేదండీ.

చూద్దాంలే.

సుజాత, విజయ, శేఖరం బకాయిలతో సహా జీతాలు తీసికొని వెళ్ళారు. మిగిలిన పైకాన్ని బట్వాడా చేయగా హెడ్మాస్టర్, స్టోర్సు చూసే రామం, గుమస్తాలు మిగిలిపోయినారు. వీళ్ళ జీతాలు నిలిచిపోయినవి. నెత్తురుచుక్క లేని ముఖాలతో నిల్చున్నారు. హెడ్మాస్టరుని క్రొత్తగా కట్టించిన గదిని చూపమన్నాను. ముఖం తేలవేశాడు. ఇదివరకే ప్రభుత్వమిచ్చిన బదిలీ ఆర్డర్లను వాళ్ళకిచ్చి ముట్టినట్లు సంతకాలు చేయించుకున్నాను. ముగ్గురినీ మూడు పల్లెటూళ్ళు రిపర్ట్ ఐనారు. ఇరవై నాలుగు గంటల్లో ఆ వూళ్ళలో చేరాలి. సి. ఐ. డి. వారిచ్చిన నివేదికలను వాళ్ళకు చదివి వినిపించాను. విజయను పిలవమని కబురు పంపితే అవిడకు నా దగ్గరున్న నాల్గవ ఆర్డరిచ్చాను. వేరే ఏర్పాట్లు జరిగేటంతవరకు విజయను ఆ ఉన్నత పాఠశాలకు హెడ్‌మిస్ట్రెస్‌గా ప్రభుత్వం ఉత్తరువు జారీ చేసింది. నా ఎదటే హెడ్మాస్టర్ వెంకటేశం నుంచి ఛార్జి తీసుకుంది. రెండు నెలల తర్వాత మళ్ళీ వస్తానని అప్పుడు ఈ

స్కూలు పరిస్థితులను సరిదిద్దగలనని వ్రాసి విజయకిచ్చాను. బయటకు రాగానే విజయ కూడా వచ్చింది. టేచర్లంతా మా చుట్టూ మూగారు. విజయ ఇంకా వివాహం చేసుకోలేదని సుజీ నిన్న చెప్పింది. బదిలీల వార్త వాళ్ళ నందరినీ ఆనందంలో ముంచింది. విజయ వీడ్కోలు చెప్పబోతూ అన్నది.

"మీరు రావడం మంచిదైంది. ఈ రాత్రికి మా ఆతిథ్యం స్వీకరించమని ప్రార్థన".

"మంచిది కాదమ్మా. మీకు వివాహం కాలేదు. ఈసారి నా భార్యతో వస్తాను. అప్పుడు తప్పకుండా మీ ఇంట్లోనే దిగుతాం".

"మీకు పిల్లలా?"

"రాబోయే నెలలో ఒక పిల్లను సెలక్ట్ చేసి పెట్టుంది మా అమ్మ అప్పుడావిడ టొడ్లోనించి ఇచ్చే మంగళసూత్రాన్ని బిగిస్తాను".

"మీ ఇష్టానిష్టాలతో ప్రసక్తి లేదా?"

"నా మంచిని విచారించేది మా అమ్మే. నాకు ఇష్టంలేకుండా ఆవిడ ఏమీచేయదు. నేనూ అంతే."

"మీరు వచ్చేనాటికి సుజాత ఇక్కడ ఉండదు."

"ఎందుకని?"

"రాజీనామా ఇచ్చి విశాఖవెళ్తున్నది."

"చీడపురుగులు పోయినా వెళ్తున్నదా?"

సుజీ కలగజేసుకుంది.

"మీరేగా ఈఉద్యోగం వదలుకొని మీ అమ్మగారు నడిపే స్కూలులో చేరమన్నారు."

"మరచిపోయినా."

"ఐతే రాజీనామాను ఉపసంహరించుకోమంటారా?"

"అది మీఇష్టం. ఐనా ఆ అమ్మ ఏం సలహా ఇస్తుందో? విజయగారూ, ఒక వారంరోజులుదాకా సుజాతగారి రాజీనామాను పైకి పంపకండి. ఇదంతా జీతంలేని సెలవగా తీసుకోండి."

"జీతం లేకుండానా ?"

"మూడు నెలలు ఓపికపట్టారుగా, ఇంకొక్క వారం...."

ఆ సాయంత్రం స్టేషన్‌కు చేరాను. దూరంగా సుజీ కన్పించింది స్వర్ణద్రూపి. మేలిమి రంగు కాకుగాని మంచి రంగే. కళ్ళలో వెలుగు ఉంది. నడతలో సౌమ్యత,సంస్కారం ఏమనుకుంటున్నదో? నా సలహాను వెంటనే అమలు జరిపింది. నామీద ఏమన్నా ప్రేమా? తెలీదు. నాలో ప్రేమాంకురాలు మొలకెత్తినవా? అంతుపట్టలేదు. చిన్ననాటి స్నేహితురాలు. నా సహాధ్యాయిని చేసుకొని మోసపోయింది. విధి వంచిత. వాడి అన్నే ఇంతదాకా ఇక్కడున్న హెడ్‌మాస్టరని తెలియదేమో! ఇంటికివెళ్లి సుజాత సంగతి అమ్మకు వివరించాను: ఒక ఉపాధి కల్పించమని, కంటికి రెప్పలా కాపాడమని, మంచి సంబంధం చూసి సుజీకి వివాహం చేయమని చెప్పాను. నాల్గవ రోజు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి సుజీతో ఇంకెవరో ఉన్నారు. అమ్మతో మాట్లాడుతున్నారు. నన్ను చూచి సుజీ మందహాసం చేసింది. నన్నుకూడా అక్కడే కూచోమని అమ్మ ఆదేశించింది. కూచున్నా.

"అమ్మాయి సుజీ, రేపటినుంచే నా స్కూలులో చేరు. ఇవిగో ఆర్డర్లు."

"అలాగేనండీ,"

"నీకభ్యంతరం లేకపోతే మంచి సంబంధం చూశాను. నీ వివరాలను మా శశి పూర్తిగా వివరించాడు."

"శశి అంటే?"

"చిన్నప్పుడు బాబ్జీ అని పిలిచేదానివి. వాడే శశి."

"అసలు పేరు మరచిపోయినట్లున్నా."

"పోనీలే, బాబ్జీ అనే పిలు. పెళ్ళి సంగతి..."

"ఒకసారి బందిగదండీ. మళ్ళీఆ నరకంలోకి..."

"ఈసారి అలా కాదు. నే కుదిర్చిన సంబంధాలు ఇంతవరకు చాలా ఆనందంగా సాగుతున్నవి. నీ విషయంలోకూడా ఆ బాధ్యత నాదే. నీ మీద ఈగ వాలనివ్వను. సరేనా."

"మీ ఇష్టం."

"చక్కని కుర్రవాడున్నాడు. మీ ఇద్దరికీ ఈడూ జోడూ కుదురుతుంది. సంస్కారి, నామాటకు విలువిస్తాడు. చేసు కుంటావా?"

"మీకే అన్ని విషయాలను అప్పగిస్తున్నాను."

"అబ్బాయిని ఇదివరకేచూచావు. మళ్ళీచూస్తావా?"

"నే నెప్పుడు చూచానండీ? గుర్తులేదు."

"అంత మతిమరుపైతే ఎలా సుజీ?"

"అమ్మలాంటివారు మన్నించండి."

"శశీ, చూశావుగా సుజీని. నీకిష్టమేనా?"

"ఏమిటమ్మా నువ్వనేది?"

"సుజీని నీవు పెళ్ళి చేసుకోవడం నాకిష్టం."

"ఏం చేస్తాను. అలాగే కానీయి."

ముహూర్తం నిశ్చయిస్తా. రేపే నిశ్చయం. సుజీ, అబ్బాయితో ఏమన్నా మాట్లాడి వివరాలు తెలుసుకోవాలంటే వెళ్ళు. వచ్చి నా కేసంగతీ చెప్పాలి. నీ తమ్ముడిక్కడే ఉంటాడు. అతనితో కాస్త మాట్లాడాలి. శశితో వెళ్ళు

నెమ్మదిగా నా గదిలోకి చేరుకున్నాను. ఇంత త్వరలో ఇలాంటి నిర్ణయాన్ని అమ్మ తీసుకుంటుందని ఊహించలేదు. ఇదంతా నేనే పన్నిన కుట్ర అని సుజీ అపోహపడవచ్చు. ఆమెతో ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? అసలు నన్ను చేసుకోవటం సుజీకి ఇష్టమేనా? ఈ విషయాలను వేటినీ ఆలోచించకుండా ఇలా చేసిందేమిటి? నేను రాకముందే నా సంగతి మాట్లాడుకున్నారా? సుజీనే అడుగుతా.

"సుజీ, అమ్మ చెప్పింది నీకిష్టమేనా ?"

"పెద్ద కుట్ర పన్నినట్టున్నారే !"

"నా ప్రమేయమేమీలేదు. నన్ను నమ్ము, సుజీ.

" ఒకసారి మోసపోయిన తర్వాత మగవాడిని నమ్మగలనా ?"

"అంగన నమ్మరాదన్నారు."

"ఐతే మీ అమ్మకు మాటెందు కిచ్చారు."

"ఆవిడ అంగనలలో ఆదర్శగృహిణి,సంఘసేవిక, నామేలు కోరేది.

"నేనెలాంటిదానినో, నాశీల మెలాంటిదో తెలుసుకోకుండానే చేసుకుంటారా ?"

"ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే మనిషి మాఅమ్మ నీలో ఎలాంటి కళంకమున్నదని స్ఫురించినా ఆవిడ నిన్ను చేసుకోమనదు. నీకు మనస్ఫూర్తిగా ఇష్టమైతేనే చెప్పు."

"నాకు సంబంధాలు చూస్తున్నప్పుడు మీ సంగతి నాన్నకు చెప్పించాను. కాని మీ అంతస్తుకి మేము సరితూగలేమని నాన్న పట్టించుకోలేదు."

"జ్ఞాపకమున్నానన్నమాట. అంతస్థులు కాదు సుజీ అంతఃకరణలు కలవాలి. అమ్మ కేవలం ఆదర్శాలు వల్లించే మనిషికాదు. తన జీవితంలోనే ఆచరిస్తుంది."

"రెండవసారి కూడా నేను మోసపోనని నమ్మమంటారా ?"

"అమ్మనడుగు. మాతృవాక్య పరిపాలన నా ధ్యేయం. కాని..."

"కానీలు, అర్థణాలు లేవుగా. ఏమిటి సందేహం?"

"ఏంలేదు. అమ్మ, నువ్వు ఏకమై నన్ను సరిగా ఉండనిస్తారా ?"

"ఉండనివ్వకపోతే మాకేగా నష్టం."

"సరే, అమ్మకు చెప్పు నీ అభిప్రాయం?"

"రేపు ఉద్యోగంలో చేరమంటారా ?"

"అమ్మ చేరమంటే చేరు, నాకెలాంటి అభ్యంతరమూ లేదు."

"వస్తానండీ."

"పెళ్ళిపీటలమీదికేగా !"

"ఇంక తప్పేదేముంది ?"

"చక్కగా ఆలోచించి నిశ్చయించుకో, సుజీ."

"ఇదివరకే ఐపోయింది ఆ నిశ్చయం ప్రస్తుతానికి సెలవు ఇప్పించండి స్వామీ !"

"వెళ్ళిపోయింది మర్నాడు. ఉద్యోగంలో చేరింది. ముహూర్తం పెట్టించినట్లున్నది అమ్మ. పదిరోజుల తర్వాత మా వివాహం ఘనంగా జరిగింది. సుజీ నేనూ ఒకటైనాము. సుజీ ఏమి చెప్పితే దానిని అమ్మ ఆమోదిస్తున్నది. నేనే ఒంటరివాడినైనాను. సుజీ వెంటలేనిదే సాయంత్రాలు నే కదలటానికి వీలులేదు. ఏదైనా ఊరు వెళ్ళవలసివస్తే సుజీనికూడా ప్రయాణం కమ్మంటుంది. ఒక విధంగా నాకు స్వేచ్ఛ పోయింది. కాని అన్ని విషయాలను సుజీకి వదలి వేయటంతో చాలా విశ్రాంతి దొరుకుతుంది. ఏమన్నా అంటే, మోసంచేసి నన్ను చేసుకున్నారని సాధిస్తుంది మృదువుగా. కాస్త కోపంవస్తే బాబ్జీ అని పిలిచి కోపం పోయేట్టు చేస్తుంది. నెల రోజులు ప్రశాంతంగా గడచినై. ఇక మొదలుపెట్టింది పోరు. విజయకు సంబంధం చూడమన్నది. అమ్మతో మాట్లాడమన్నా విధిలేక సుజీతో కలసి నేనే అమ్మతో ఈ ప్రసక్తి తెచ్చాను. మా అక్కయ్య పెళ్ళికి వచ్చిందిగా. అప్పుడన్నదట. తన మరిది భాస్కరానికి సంబంధం చూడమని. సుజీద్వారా విజయనుగూర్చి అంతా తెలుసుకుంది.

"ఒరే, శశీ! భాస్కరం పెళ్ళి చేసుకుంటాడేమో

కనుక్కోరా."

"ఎందుకు చేసుకోడు. ప్రిన్సిపాలైనాడుగా."

"ఐనాడులే ఇలా దూరుగా తిరుగుతున్నాడు. చూశావుగా. ఆ అమ్మాయిని చేసుకుంటాడేమో చూడు."

"నీ బొడ్లోమంచి ఒక మంగళసూత్రం తీసివ్వు. వెంటనే కట్టేస్తాడు."

"వేళాకోళం కాదురా."

"మరి విజయ వీడిని చేసికుంటుందా?"

"వాడిని రమ్మని వ్రాయి. వాడిని తీసికొని సుజీతో నువెళ్ళి రావాలి. సుజీ, ఏమంటావు?"

"ఏమంటాను అత్తయ్యా! మీతో ఇదివరకే ఈ సంగతి చర్చించాను. మీరు సరేనన్నారు. ఆపదలో నున్నప్పుడు నన్ను చేరదీసి, కాపాడిన విజయకూడా ఒక ఇంటిదైతే ముందుగా సంతోషించేది నేనే."

"వెళ్ళిరామ్మా."

ఉత్తరం వ్రాస్తే భాస్కరం వచ్చాడు. చూచాయగా విజయసంగతిచెప్పి, ఆమెను పెళ్ళి చేసుకోవటం మంచిదన్నాను. తలాయించాలని చూశాడుగాని వాడి ఎత్తు సాగలేదు. అమ్మ, సుజీ కలసి వత్తిడి చేయటంతో సరే నన్నాడు. మేము వస్తున్నట్లుగా విజయకు వ్రాశాను. స్టేషనుకు వచ్చింది. మా ముగ్గురినీ చూసింది.

భార్యతో కలసి వచ్చి మా ఇంట్లో దిగుతామన్నారు. అలా కాకుండా సుజాతను తీసుకు వచ్చారు. మీ భార్యను వేము చూడగూడదా?

తప్పకుండా చూడవచ్చు. భార్యతోనే వచ్చాను.

"అంటే సుజాత..."

"నా భార్యే"

"నిజం?"

"మున్మాటికీ, శుభలేఖ పంపాను. అందలేదా?"

అందింది. కాని అందులో సుజాత అని ఉంటే ఎవరో అని అనుకున్నా. మా సుజీయే అనే భావన రాలేదు.

విజయ ఇంటికి చేరుకున్నాము. అన్ని సదుపాయాలు చాలా బాగా చేసింది. స్నానాదికం నిర్వర్తించిన తర్వాత తీరికగా కబుర్లలో పడిపోయాము. భాస్కరాన్ని పరిచయం చేయటం మరచిపోయాను. గుర్తువచ్చింది.

ఈయన మాబావగారి తమ్ముడు,జూనియర్ కాలేజీకి ప్రిన్సిపాల్. మాతోపాటు సరదాగా తీసికొచ్చాము. మీదీ జూనియర్ కాలేజీయేగా మీ సమస్యలను మీరు చర్చించుకోవచ్చు. ఆఁ, మరిచిపోయాను. సుజీకి ఏదో మా అమ్మ చెప్పింది. ఆ విషయం సుజీయే చెప్తుంది.

"....సుజీ, ఏమిటి మూగనోము. మీవారి ఎదట మాటలు రావా?"

"వారి ఎదటేనండీ ఒక దేవాగుడు. కాస్త తగ్గించే ఉపాయం చూడండి."

"ఏమే సుజీ, నీమీద పెద్ద ఫిర్యాదు వచ్చింది. పూర్తిగా మారిపోయినావా?"

"లేదండీ వదినగారూ. అసలు అదబిడ్డికన్నా ఎక్కువ జోరులో ఉన్నారు. శాంతించండి. మా అత్తగారు మీకొక కబురు అందజేయమన్నారు. మీరు మావెంట రావాలి.

"మీ అత్త అంటే నాకు భయమే. నీకు కుదిర్చినట్లుగా నాకు కూడా వెంటనే పెళ్ళి చేస్తుందేమోనని దిగులుగా ఉంది."

"వదినగారూ, ఒక మనవి. మా అత్తగారికి నీ పెళ్ళి చూడాలని గట్టి సంకల్పముంది. నెరవేరేదాకా నిద్రపోరు ఆవిడ మాట వింటే కనీసం నీ భర్త ఐనా బాగా సుఖపడతాడు."

"నువ్వు సుఖపడటంలేదా?"

"నా సుఖమేమిటిలే. బాబీని అడుగు."

"ఈ బాబీ ఎవరే?"

"మా ఆయనే. నా చిన్నతనం మావూళ్లోనే ఉండేవాళ్ళు అప్పుడు ఆటల్లో బాబీ అనే పిలిచేదాన్ని. ఆయనే గుర్తుచేశారు. ఎందుకని?"

నాచేత సేవలు చేయించుకోవటానికి.

"అన్నయ్యగారూ, సుజీ ఇలా మాట్లాడుతుందేమిటి? దానిని కష్టపెడుతున్నారా?"

"ఇంత వరకు నేనే కష్టపడుతున్నా. మా బావగారి తమ్ముడిని మీరు చేసుకుంటే నాకష్టాలు పోతై. మన మిద్దరం కలసి సుజీ సంగతి చూడవచ్చు."

"నా ప్రమేయం లేకుండానే నాకు సంబంధం కుదర్చారా?"

"కాదండీ వదినగారూ! మా అత్తగారు నిశ్చయించారు ఆవిడ మాటకు తిరుగులేదు. మీ రుభయులు సంప్రదించుకోండి."

భోజనాలైనతర్వాత స్కూలుకు చేరాము. ఉపాధ్యాయులందరూ ఆశ్చర్యంతో చూశారు. వెనకటి హెడ్మాస్టరుగారిని సస్పెండ్‌చేసి కేసు పెట్టారుట. రామానికి ఉద్యోగం పోయిందట. హెడ్ గుమాస్తాకు వార్నింగ్ ఇచ్చారని విన్నాము. స్కూలు కళ కళలాడుతున్నది మాకు కనబడకుండా వెళ్ళిన సుజీని పట్టుకుంది విజయ.

ఉపాధ్యాయులతో తీరికలేకుండా పసపోసిన పిట్టలాగా వాగుతున్నది. ఇది వరకు మూగనోములో ఉన్న సుజీ ఇంత మారిపోయిందేమా అని అందరు ఆశ్చర్యపోయారు. ఆ రాత్రికి విజయ, భాస్కరం ఏమేమో చర్చించుకుంటున్నారు. సుజీ నాదగ్గరకు వచ్చింది.

"బాబీ నన్ను మోసంచేసి పెళ్ళి చేసుకున్నారు. ఇప్పుడు విజయను మోసంచేయాలనా మీసంకల్పం?"

"సుజాతాదేవిగారూ, మోసగింపబడ్డది నేనేనండీ! మీకేం, మీరు హాయిగా ఉన్నారు."

"మిమ్మల్ని కనిపెట్టుకుని తిరగటమేనా హాయి అంటే? ఒంటరి బ్రతుకు చాలా బాగుండేది దానిని...."

"జంటబ్రతుకు చేసుకున్నాం."

"ఆ జంట అనే జంఝాటంలో...."

"మీదే పైచేయి ఐంది అలాచేశారు మీరు, మీ అత్తగారు."

"ఆవిడనేమీ అనకండి."

"ఈవిడనూ అననులెండి, లేకపోతే ఇంటికి వెళ్ళగానే..."

"చాలులెండి ఈ నటన. భాస్కరం సంగతి విచారించరా?"

"వాడు సుముఖుడే. విజయ విషయమే నీవు తేల్చుకోవాలి."

"వెళ్ళవస్తా. విశేషాలుంటే చెప్తాలెండి."

"వస్తారుగా."

విజయ ఏం నిర్ణయం తీసుకుంటుందో అని ఆలోచిస్తూ పడుకున్నాను. నిద్ర పట్టదు. భాస్కరం వచ్చాడు.కాని సుజీ రాలేదు. వాడంత వాడే ఏమన్నా చెప్తాడేమోనని ఎదురుచూచా. వాడు మాత్రం ఈల పాటలో నిమగ్నుడైనాడు. శుభశకునమే. మర్నాడు విజయను తీసికొని అమ్మదగ్గరకు వచ్చాము. భాస్కరంతోను, విజయతోను విడి విడిగా మాట్లాడివచ్చింది అమ్మ. బొడ్లో మంగళసూత్రాన్నిచూచి భాస్కరం ఆనందించాడు. విజయకు చూపించాను. సిగ్గుతో కుంచించుకుపోయింది. అక్కయ్యకు, బావకు కబురు వెళ్ళింది. ఇంకా ఎన్ని మంగళ సూత్రాలున్నయ్యో ఆవిడ బొడ్లో అని నే చూస్తుంటే సుజీ కొంటెగా నవ్వింది. విజయ ముఖంలో దరహాస రేఖలు. ●

